క్లుప్తంగా...

'పేపర్ లీక్'పై విచారణ జరిపించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌పీఎస్సీ టౌన్ ప్లానింగ్ ఉద్యోగాల రాత పరీక్ష పేపర్ లీక్ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్‌కుమార్ ఆదివారం డిమాండ్ చేశారు. పేపర్ లీక్‌లో టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌తో పాటు ప్రభుత్వ హస్తముందని నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి అనిత రామచంద్రన్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు సర్వం సిద్ధం

సనత్‌నగర్: మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. సనత్‌నగర్ నియోజకవర్గంలో జీహెచ్‌ఎంసీ పరంగా రెండు సర్కిళ్లు ఉండగా ఆయా సర్కిళ్లలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. బేగంపేట సర్కిల్‌కు సంబంధించి వెస్లీ బాయ్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 101 మంది, ఖైరతాబాద్ సర్కిల్‌కు సంబంధించి బల్కంపేట రోడ్డులోని ఆర్ అండ్ బీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 164 మంది ఓటు హక్కు వినియోగించుకుంటారని అధికారులు వెల్లడించారు.

మహిళాభ్యున్నతే ఎస్‌జీఎఫ్ లక్ష్యం



మహిళలకు బహుమతులు అందజేస్తున్న శ్రీగణేశ్

కంటోన్మెంట్: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా తగిన తోడ్పాటు అందించడమే లక్ష్యంగా శ్రీగణేశ్ ఫౌండేషన్ (ఎస్‌జీఎఫ్) పని చేస్తోందని చైర్మన్ శ్రీగణేశ్ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజులుగా నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కేవలం మహిళలకు ఆటల పోటీలు, బహుబతులే కాకుండా అవసరమైన వారందరికీ తగిన ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. కంటోన్మెంట్ ఆరోవార్డు పరిధిలోని సీతారాంపూర్, కాంటా బస్తీల్లో నిర్వహించిన మహిళా దినోత్సవాలకు ఆయన హాజరైన బహుమతులు అందజేశారు.

ముగిసిన వన్ వీక్ వన్ ల్యాబ్

లాలాపేట: సిఎస్ఐఆర్–ఐఐసిటిలో ఈ నెల 7న ప్రారంభమైన వన్ వీక్ వన్ ల్యాబ్ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి గౌహతి నైపర్ డైరెక్టర్ ప్రొ. యుఎస్ఎన్ మూర్తి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించడానికి ఆహార సాంకేతిక రంగంలో శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. వన్ వీక్ వన్ ల్యాబ్ కార్యక్రమం సైన్స్‌ను కెరీర్‌గా ఎంచుకోవడానికి విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రాంతీయ భాషల్లో వైజ్ఞానిక విజయాలను ప్రజల చెంతకు చేరడం ద్వారా ప్రజల్లో నమ్మకం పెరుగుతుందన్నారు. డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ ప్రింటింగ్ మెటీరియల్ విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

రాంగోపాల్‌పేట్: నకిలీ కెనాన్ క్యాట్రిడ్జ్‌లు, ఎప్సన్ ఇంక్ బాటిళ్లు విక్రయిస్తున్న ఓ దుకాణంపై పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. కెనాన్‌కు చెందిన క్యాట్రిడ్జ్‌లు నకిలీవి విక్రయిస్తున్నారని ఎన్ఫోర్స్ ఆఫ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ సంస్థకు కెనాన్ సంస్థ సమాచారం అందించింది. దీనిపై ఆ సంస్థ సీనియర్ మేనేజర్ విజయ్‌కుమార్ సర్వే చేస్తుండగా రెతిఫైల్ బస్టాండ్ ప్రాంతంలో ఉండే అర్చనా ఆర్కెడ్ గ్రౌండ్ ఫ్లోర్‌లోని షాపు నంబర్–4లో ఎస్‌కేఎస్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో కంప్యూటర్ విడిభాగాల విక్రయించే షాపులో నకిలీ కెనాన్ క్యాట్రిడ్జ్‌లతో పాటు ఎప్సన్ ఇంక్ బాటిళ్లు గుర్తించి గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు దుకాణంపై దాడిచేసి నకిలీ క్యాట్రిడ్జ్‌లు, ఇంకు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌కేఎస్ సంస్థ యజమానికి విజయ్ భాస్కర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఖేలో ఇండియా పనుల జాప్యం'

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో ఖేలో ఇండియా పనుల్లో తీవ్రజాప్యం జరుగుతుంది. ఈ పనులు కోసం కేంద్రం నుంచి రూ.13.5 కోట్లు మంజూరు చేయగా రూ.7 కోట్లతో అథ్లెటిక్స్ సింథటిక్ ట్రాక్, రూ.5 కోట్లతో లేడీస్ హాస్టల్‌లో స్విమ్మింగ్ పూల్, రూ.1.5 కోట్లు టెన్నిస్ కోర్టు పనులకు కేటాయించారు. మొదట ఓయూ బిల్డింగ్ డివిజన్ ఆధ్వర్యంలో పనులు ప్రారంభం కాగా ఆలస్యమవుతుందని ఓయూ అధికారులు టీఎస్–ఈడబ్ల్యూడీసీకి స్విమ్మింగ్ పూల్, టెన్నిస్ కోర్టు పనులను అప్పగించారు. అయినా పనుల్లో జాప్యంతో ఈ ఏడాది కూడా అందుబాటులోకి రావడం లేదని వీసీ ప్రొ.రవీందర్ జోక్యం చేసుకొని పనులను త్వరగా పూర్తి చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు.

బొల్లారం అంతా బోగస్ ఓట్లే!

తాళాలు వేసి ఉన్న ఇంటి నంబర్లపై నమోదు
ఒకే ఇంట్లో ఓటర్లుగా అన్ని కులాలు, మతాల వారు..



బోగస్ ఓటర్లుగా నమోదు చేసిన తాళాలు వేసి ఉన్న ఇళ్లు ఇవే

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో ఉన్న ఓట్ల కన్నా బోగస్ ఓట్లే ఎక్కువయ్యాయి. వివిధ రాజకీయ పార్టీల నేతలు తప్పుడు మార్గాలను ఎంచుకుని వేల సంఖ్యలో బోగస్ ఓటర్లను నమోదు చేయించారు. ఈ తతంగం బోర్డు ఎనిమిదవ వార్డు బొల్లారంలో కూడా అధికంగానే ఉంది. ఎవ్వరికీ అనుమానం రాకుండా సరికొత్త మార్గంలో బోగస్ ఓటర్లను నమోదు చేయించారు తాళాలు వేసి ఉన్న ఇళ్లు, ఒంటరిగా ఉండే ఇళ్లపై, ముగ్గురు నలుగురు ఓటర్లను ఉన్న ఇంటి నంబర్లపై కనీసం 25–30 వరకు బోగస్ ఓటర్లను నమోదు చేయించారు.



బోగస్ ఓట్లు ఇలా..

రిసాలా బజార్, పయనీర్ బజార్, టీపీటీ బ్లాక్స్, కళాసీగూడ, హరి ఓం కాలనీ, కళాసీగూడ మహంకాళి దేవాలయ సమీపంలో ఇలా చెప్పుకుంటూ పోతే చాలా బజార్లల్లో ఇదే వ్యవహారం. 8–17–060 ఇంటి నంబర్‌పై 23, 8–18–143 నంబర్‌పై 28, 8–12–292 నంబర్‌పై 26, 8–13–067 నంబర్‌పై 25, 8–22–050 నంబర్‌పై 30 ఇక ఏ ఇంటి నంబర్, అడ్రస్ లేకుండానే సీరియల్ నంబర్లు వేసి సుమారు పది మంది బోగస్ ఓటర్లను నమోదు చేయించారు. పైన పేర్కొన్న ఇంటి నంబర్లల్లో ఓ ఇంట్లో దాదాపు పదిహేను సంవత్సరాల నుంచి ఓ కుటుంబం, మరో ఇంట్లో నాలుగు సంవత్సరాల నుంచి మరో ఇంట్లో రెండు సంవత్సరాల నుంచి ఎవరూ ఉండటం లేదు. ఈ ఇళ్లని శిథిలావస్థకు చేరి కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి.

వివిధ రాష్ట్రాల వారి పేర్లు సైతం..

విచిత్రమేమిటంటే బోగస్ ఓటర్ల నమోదులో కూడా అన్ని కులాలు, అన్ని ప్రాంతాల వారికి రాజకీయ నాయకులు ప్రాధాన్యం కల్పించారు. ఒకే ఇంట్లో రెడ్డి, యాదవ్, పటేల్, చౌదరి, చారీ, క్రిస్టియన్, వెలమ, కులస్తులను నమోదు చేయించారు. ఇక ప్రాంతాల వారీగా చూస్తే తెలంగాణ, ఆంధ్ర, బిహార్, రాజస్థాన్, యూపీ, బెంగాల్ తదితర రాష్ట్రాల వారికి చెందిన వారి పేర్లతో కూడా బోగస్ ఓట్లను నమోదు చేయించారు. ఇక 23 మంది బోగస్ ఓటర్లు ఉంటే అందులో ముగ్గురు మహిళలు, మిగిలిన వారు పురుషులు, మరో ఇంట్లో కేవలం ఇద్దరు మహిళలు, 24 మంది పురుషులు, మరో ఇంట్లో ముగ్గురు ఇలా మహిళల పేర్లతో నమోదు చేయించారు. ఇక 8–18–143 ఇంటి నంబర్‌పై చేయించిన బోగస్ ఓటర్ నమోదులో సీరియల్ నంబర్ 821, 822లపై సువాదేవి పేరు ఉండగా, ఇంటి నంబర్ 8–12–292లో సీరియల్ నంబర్ 901లో చర్‌కమాన్ ఆశతో పేరు నమోదు కాగా ఇదే పేరుతో ఇంటి నంబర్ 8–13–067లో సీరియల్ నంబర్ 737లో మరోసారి నమోదైంది. ఇక ఆదర్శనగర్‌లో ఓ రాజకీయ నేత తన చతురతను ప్రదర్శించాడు. ఒకే ఇంటి నంబర్లపై కాకుండా రెండిళ్ల నంబర్ల తేడాతో నాలుగేసి బోగస్ పేర్లతో ఓటర్లను నమోదు చేయించాడు. సదర్ బజార్, గడ్డిబస్తీ, జనప్రియ బంగ్లాస్, స్నేహా కాలనీ ఇలా బొల్లారం లోని అన్ని బస్తీలు, కాలనీల్లో బోగస్ ఓటర్ల నమోదు జరిగింది. గత కొన్ని రోజులుగా బోగస్ ఓట్లపై ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా బోర్డు అధికారులు స్పందించి బోగస్ ఓట్లను తొలగించాలని కోరుతున్నారు.





ఒకే ఇంటి నంబర్‌పై అన్ని కులాలకు చెందిన ఓటర్లుగా నమోదు

ప్రచారం చేస్తూ.. హామీలిస్తూ

ప్రచార పర్వం

కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వివిధ పార్టీల నాయకులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. రోజుకొక కాలనీ, బస్తీలల్లో పర్యటిస్తూ గతంలో చేసిన పనులు, చేయాల్సిన పనులపై ప్రజలకు హామీలిస్తూ మద్దతు కోరుతున్నారు. –రసూల్‌పురా

రూ. కోట్లతో అభివృద్ధి చేశా..



బీఎన్. శ్రీనివాస్‌కు మద్దతుగా జంపన ప్రతాప్ ప్రచారం

తాను బోర్డు ఉపాధ్యక్షుడిగా ఉన్న సమయంలో మూడవ వార్డులో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టానని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ అన్నారు. ఆదివారం ఈద్గా అంబేడ్కర్ నగర్‌లో బీజేపీ మహంకాళి అధికార ప్రతినిధి బిఎన్. శ్రీనివాస్‌కు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. ఈద్గా అంబేడ్కర్‌నగర్‌లోనే సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైను పనులు, కమ్యూనిటీహాల్, పవర్‌బోర్‌వెల్స్ అభివృద్ధి చేశానని ఈ సారి బిఎన్. శ్రీనివాస్‌ను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో దాల్ రాజు, రాములు, జగదీష్, చంటి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా



సమస్యలు తెలుసుకుంటున్న శ్యామ్‌కుమార్

గత బోర్డు ఎన్నికల్లో అవకాశమిచ్చి తనను గెలిపిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి కోట్లాది రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు ప్యారసాని శ్యామ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఏడవ వార్డు పరిధిలోని జయభారతి సొసైటీ, ఓల్డ్ డైరీ ఫాం ఎస్సీ కాలనీల్లో శ్యామ్‌కుమార్ పర్యటించి స్థానికులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోర్డు సభ్యుడి పదవీ కాలం ముగిసినా ప్రజల మధ్య ఉంటూ సమస్యలను తెలుసుకుని వాటిని బోర్డు అధికారుల సహాయంతో పరిష్కరించానని చెప్పారు. అపరిష్కృతంగా ఉన్న కొన్ని అభివృద్ధి పనులను ఈ సారి పూర్తి చేస్తామని హామీచ్చారు. ఈ కార్యక్రమాల్లో బిందు, జగన్మోహన్, అరుణ, కేఎస్. రావు, శారద, రాయ్, రామారావు, సాయిబాబా, మాధవి రమేష్, వికే. రావు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేస్తా..



ఎన్నికల ప్రచారం చేస్తున్న టీఎన్. శ్రీనివాస్

దివంగత ఎమ్మెల్యే సాయన్న సహకారంతో రెండవ వార్డు పరిధిలోని పలు బస్తీలు కాలనీల్లో కోట్లాది రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టానని బీఆర్ఎస్ నాయకులు, మార్కెట్ మాజీ చైర్మన్ టిఎన్. శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వార్డు పరిధిలోని కట్టమైసమ్మ బస్తీ ఉప్పలమ్మ ఆలయం సమీపం, అవంతి కాలనీలో టిఎన్. శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏ పదవి లేకుండానే ప్రజలకు అందుబాటులో ఉంటూ పలు సమస్యలు పరిష్కరించానని ఈ సారి అవకాశమిస్తే పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులు పూర్తి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరక్టర్ దేవులపల్లి శ్రీనివాస్, కుమార్, శ్యామ్‌రెడ్డి, సురేష్, బాబు,మల్లేష్, నరేష్ గౌడ్ పాల్గొన్నారు.

తెలంగాణలో మహిళలకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్: బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళాభ్యున్నతికి అధిక ప్రాధాన్యమిస్తోందని బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ ఆవరణలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి–రూప దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ.750 కోట్ల రుణాలను మంజూరు చేసిందని కంటోన్మెంట్‌లోనూ 20 వేలకు పైగా మహిళా సంఘాల సభ్యులు ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళలకు నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యులు ప్రభాకర్, నళిని కిరణ్, ముప్పిడి మధుకర్, రూప, మంజు, స్వరూప, అనూష, సబిత, పార్వతి, భాగ్య, శాంతి, శ్రీధర్, ప్రవీణ్ యాదవ్, సురేశ్, సోమయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కంటోన్మెంట్: నిరుపేదలకు అన్ని రకాల వైద్య పరీక్షలు, చికిత్సను ఉచితంగా అందిస్తున్న మర్రి అరుంధతి ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ ఆరో వార్డు తాడ్‌బంద్‌లో మర్రి అరుంధతి ఆసుపత్రి, బోర్డు మాజీ సభ్యులు పాండుయాదవ్–విద్యావతిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో కేవలం వైద్య శిబిరాలు నిర్వహించడమే కాకుండా, వైద్యం అవసరమైన వారందరికీ ఉచితంగానే ఆపరేషన్లు చేయిస్తున్నామన్నారు. ఎంఆర్ఐ స్కానింగ్ సహా వేలాది రూపాయల విలువ చేసే వైద్య పరీక్షలు సైతం ఉచితంగానే అందిస్తున్నామని తెలిపారు. విద్యావతి పాండుయాదవ్ మాట్లాడుతూ.. తాము కోరిన వెంటనే ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయిస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలన్నారు. రాబోయే రోజుల్లో వార్డు పరిధిలోని అన్ని బస్తీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, నేతలు ముప్పిడి మధుకర్, ప్రవీణ్ యాదవ్, దీననాథ్, సురేష్, సోమయ్య పాల్గొన్నారు.

లాలాపేటలో 'హాథ్ సే హాథ్ జోడో'



రోడ్డును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

లాలాపేట: కేంద్ర మంత్రి, డిప్యూటీ స్పీకర్, డిప్యూటీ మేయర్లు ప్రాతినిథ్యం వహిస్తున్న సికింద్రాబాద్ నియోజకవర్గంలోని బస్తీల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఏఐసీసీ డేటా టెక్నాలజీ విభాగం నేషనల్ కోఆర్డినేటర్ దీపక్‌జాన్ ఆరోపించారు. హాథ్ సే హాథ్ జోడోలో భాగంగా ఆదివారం తార్నాక డివిజన్ లాలాపేటలో స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దీపక్ జాన్ మాట్లాడుతూ.. బస్తీల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దోమల బెడదతో జ్వరాల బారిన పడి ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మజీ, ప్రవీన్ లాల్, రాజు, లూథర్, కిరణ్, అరుణ్ పాల్గొన్నారు.



స్వామి కల్యాణం.. తరించిన భక్తజనం

నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్నస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు నేతృత్వంలో ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి, మేళాతాళాలు , బాజాభజంత్రీలు, మంత్రోచ్చారణాల మధ్య కల్యాణ తంతు జరిపించారు. పూజల్లో రఘునందన్, శేఖర్, శ్రీనివాసగౌడ్, వేణు, శ్రీకాంత్ పాల్గొన్నారు. –చిలకలగూడ

స్కాములతో బీజేపీ, స్కీములతో బీఆర్ఎస్ మోసం

● ప్రొ. గాలి వినోద్‌కుమార్

లాలాపేట: స్కాములు, స్కీముల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసాలు చేస్తున్నాయని దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోఫోర్స్ స్కాం మొదలుకుని లిక్కర్ స్కాం వరకు 95 శాతం ఉత్తరాది వాళ్లు ముఖ్యంగా గుజరాతీయులు కాగా కేవలం 5 శాతం దక్షిణాది వారు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు వీరిలో ఎవ్వరికీ సరైన శిక్షలు వేయలేదన్నారు. స్కాముల పేరుతో బీజేపి, స్కీముల పేరుతో బీఆర్ఎస్ మోసాలకు తెరలేపుతున్నాయన్నారు. దేశంలో 85, రాష్ట్రంలో 93 శాతం ఉన్న బహుజనుల సమస్యలను చర్చకు రాకుండా, సామాజిక అంశాలపై ప్రజల దృష్టి మరల్చే కార్యక్రమాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

క్రైం కార్నర్..

మద్యానికి అలవాటు పడి తల్లి, చెల్లిపై దాడి

● సోదరులపై కేసు

అమీర్‌పేట: కన్న తల్లి, చెల్లిని వేధిస్తూ దాడికి పాల్పడ్డ ఇద్దరు సోదరులపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రవిరాజ్ వివరాల ప్రకారం.. రాజరాజేశ్వరీనగర్ కాలనీకి చెందిన బి.మంగకు కిరణ్, సత్యం అనే ఇద్దరు కుమారులు, కుమార్తె లక్కీ ఉన్నారు. ఇటీవల భర్త చనిపోవడంతో మంగ ఇళ్లలో పని చేస్తుండగా కూతురు కూడా చేదోడువాదోడుగా ఉంటోంది. ఇద్దరు కుమారులు మాత్రం జులాయిగా తిరుగుతున్నారు. మద్యానికి అలవాటు పడ్డ వారు తాగుడు కోసం డబ్బులు కావాలంటూ తల్లి, చెల్లిపై దాడులు సైతం చేస్తున్నారు. ఆదివారం చెల్లి ఫోన్ లాక్కుని అమ్మడానికి ప్రయత్నించగా తల్లి అడ్డుకోవడంతో అన్నదమ్ములిద్దరూ వారిని తీవ్రంగా కొట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అకారణంగా దాడిచేసిన ఇద్దరిపై కేసు

చిలకలగూడ : మద్యంమత్తులో గొడవపడిన ఇద్దరిపై కేసు నమోదైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. డీఐ నాగేశ్వరరావు వివరాల ప్రకారం.. లలితానగర్‌కాలనీకి చెందిన అజయ్, సాయితేజ శనివారం రాత్రి అంబర్‌నగర్ కట్ట మీద కూర్చుని బిర్యానీ తింటున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన ఇరువురు యువకులు మద్యంమత్తులో అకారణంగా వారితో వాగ్వాదానికి దిగి దాడి చేసి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించగా అన్వర్ (27)అఫ్సర్ (31)గా గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

సనత్‌నగర్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం బేగంపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బేగంపేట్ బ్రాహ్మణవాడిలో నివాసముంటున్న వి. రాజు (45)కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజు కుటుంబ గత కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంది. ఈ క్రమంలో రాజు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

వినియోగదారుల హక్కులపై అవగాహన ర్యాలీ



అడ్డగుట్ట: వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామగిరి హరిబాబు అన్నారు. సంస్థ సికింద్రాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు తాండ్ర మహేష్ ఆధ్వర్యంలో శాంతినగర్ చౌరస్తా నుంచి లాలాపేట వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. వినియోగదారులు కొనుగోలు చేసే ప్రతీ వస్తువుపై ధరతో పాటు గడువు తేదీ (ఎక్స్‌పైరీ) చూసుకోవాలన్నారు. దుకాణదారుడు ఎంఆర్‌పీ ధర కంటే ఎక్కువ వసూలు చేస్తే తమకు సమాచారం అందజేయాలని సూచించారు. అనంతరం పలు దుకాణాలకు వెళ్లి వినియోగదారుల హక్కులకు సంబంధించిన స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో శివ కుమార్, మహావీర్ జైన్, రమేష్, అనిల్, దుర్గానాథ్, మల్లేష్, ప్రవీణ్, హరి శంకర్ పాల్గొన్నారు.

యోగాతో వ్యాధులకు చెక్



యోగాసనాలు వేస్తున్న సాధకులు

సనత్‌నగర్: యోగాతో మొండి రోగాలకు సైతం చెక్ పెట్టవచ్చని భారతీయ యోగా సంస్థాన్ రాష్ట్ర ఈస్ట్ అధ్యక్షులు సుధీర్ కులకర్ణి, డిస్ట్రిక్–1 అధ్యక్షులు వర్జన్ నాయక్ అన్నారు. వాతం, పిత్తం, ఖపం అంశాలపై సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ పార్కులో మూడు రోజులుగా జరుగుతున్న అవగాహన కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతీయ ప్రాచీన యోగాను ప్రపంచ దేశాలు ఆచరిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నాయన్నారు.వాతం, పిత్తం, ఖపం అంశాలపై గత మూడు రోజులుగా నిర్వహించిన అవగాహన కార్యక్రమం యోగా సాధకులకు ఎంతగానో మేలు చేకూరుస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రతిరోజూ ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ పార్కుతో పాటు పలుచోట్ల జరిగే ఉచిత యోగా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో యుగంధర్, గణనాథన్, కుసుమ, శాస్త్రి, శారద, నిర్మల, రోజా, రాజేష్, ప్రసన్న పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళా దినోత్సవంలో పాల్గొన్న వంజరి సంఘం మహిళలు

లాలాపేట: తెంగాణ రాష్ట్ర వంజరి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తార్నాకలోని వంజరి భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన మహిళా సదస్సులో పలువురు మహిళలు మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుకు రావాలని అన్నారు. అనంతరం నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. బొగ్గుల సునీత, అనురాధ, ధాత్రిక సాయిరజినీ, సాల్వేరు దేవిక, గీత, శోభ, సంఘం అధ్యక్షులు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేశం, అమరేందర్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



లాలాపేట: బలమైన పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరమ్మ పేర్కొన్నారు. లాలాపేటలోని నఫీజ్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన సికింద్రాబాద్ సీపీఐ 3వ మహాసభలకు ఆమె హాజరై మాట్లాడారు. భవిష్యత్‌లో కమ్యూనిస్టు పార్టీ మరిన్ని పోరాటాలు చేసి పేద ప్రజలకు అండగా నిలువాలన్నారు. నర్సింహ, శ్రీనివాస్, చాయాదేవి, స్టాలిన్,యాదగిరి, ఉమర్‌ఖాన్, బాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అడ్డగుట్ట: మహిళా కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడేది మజ్దూర్ యూనియన్ ఒకటేనని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం శంకర్‌రావు మాట్లాడుతూ.. దక్షిణ మధ్య రైల్వేలో మహిళా హక్కుల సాధనతో పాటు సంరక్షణ కోసం మజ్దూర్ యూనియన్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ డివిజన్ సెక్రటరీ బుచ్చిరెడ్డి, బ్రాంచ్ సెక్రటరీ బాలకృష్ణారెడ్డి, చైర్మన్ నవీన్, వెంకట్ రెడ్డి, ఉమెన్స్ కోఆర్డినేటర్ బ్రిజిత పీటర్స్, రమాదేవి, సురేందర్, చంద్రయ్య పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379